

# జాలిలేని జాబిలి

## – కొమ్మూరి వేణుగోపాలరావు



తనకు కావలసింది వెదుక్కుంటూ ముందుకుపోవడమే మానవుని జీవితం. కాని తనకు కావలసిందేమిటోకూడా తెలియని అస్పష్టస్థితి.

రచయిత కావాలనుకున్నాడు - అయినాడు. డాక్టరు కావాలనుకున్నాడు - అయినాడు. పేరు ప్రఖ్యాతులు కావాలనుకున్నాడు - లభించినై.

కానీ అతనికి యేదో కావాలి. అతన్నెంతోమంది ఆరాధించారు. జీవితంలోకి ఎందరో సుందరీమణులు ప్రవేశించారు. అతని చుట్టూ ప్రేమ హృదయంలో ప్రేమ. కాని ఆ ప్రేమ అతన్ని స్పర్శించేదేగాని అదృష్టవంతుడ్ని చేయలేదు.

యవనం వుంది - డబ్బు వుంది - కీర్తి వుంది - అంతా వున్నారు కాని...?

అతనిపట్ల జాబిలికి జాలిలేదు.

*కొమ్మూరి రవికిరణ్ గారి ప్రత్యేక అనుమతితో*
*అలనాటి అందమైన నవల పునర్ముద్రణ*

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

**"నే పోతున్నాను."**

"మళ్ళా ఎలా, ఎక్కడ, యెప్పుడు?"

"చెప్పలేను. మనం చచ్చిపోముగా అప్పుడే. జీవితంలో యెన్ని ఇలాంటి మధుర, విషాద సన్నివేశాలు నీకూ నాకూ మధ్య యెదురుకానున్నవో."

"మీ చివరి కోరిక ఏమిటి?"

"చెప్పేదా? నవ్వవు గదా?"

"ఉహూఁ"

"ఒక అందమైన అమ్మాయికి, చాలా అందమయిన అమ్మాయికి తండ్రిగా ఉండాలని. అదేమిటో నాకు ఎప్పుడూ కలిగే చిత్రమయిన కోరిక."

"ఐతే నన్ను తీసుకెళ్ళిపోతారా?"

"ఊఁ"

"ఎత్తుకుని తీసుకెళ్ళిపోతారా?"

"ఊఁ"

"అబ్బ! నాకెంత యిష్టం. యెంత యిష్టం మీరట్లా మాట్లాడుతోంటే."

"మరి సెలవు. నమస్కారం."

"ఛీ మీరు నాకు నమస్కారం చెయ్యొచ్చా? విత్ డ్రా."

ఆమె అతని చేతుల్ని ఒక దానినుంచి ఒకటి మృదువుగా విడదీసింది. వాటిని అలాగే పట్టుకుని "ఏమిటి యీ చిత్రమైన బంధం? ఈ తియ్యని, అర్థంకాని, అమృతానుబంధానికి ఈ జీవితంలో ఏమిటి ఫలితం" అనుకుంది.

అతను వెళ్ళిపోయాడు.

31

***అబ్బ! జీవితం ఎంత విశిష్టమైంది.***

***అనుభవించే కొలదీ తరగనిది, మనిషిని పాలించేది. వేధించేది, పులకరింపజేసేది, పాలించబడేది, చివరకు అర్థగాకుండా మిగిలిపోయేది.***

మధుబాబు ఎక్కడికో పోతున్నాడు, చీకటిలో దారిని వెదుక్కుంటూ.

ఎక్కడనో కాంతి కిరణం మిణుకు మిణుకు మంటోంది.

ఎక్కడ అది? ఎంత దూరం? ఏనాటికి, ఎంతకాలం యీ గమనం విసుగులేకుండా అప్పుడప్పుడూ బిక్క మొహం వేస్తూ మళ్ళీ ఉత్సాహంగా.

యెన్ని అనుభవాలో, అనుభూతులో ఇంత చిన్న వయసుకే.

ఇవన్నీ అన్ని కోణాల నుంచీ పరిశీలించటానికి, సమగ్రమైన దృష్టి అలవర్చుకోటానికీ, వ్రాసుకోవటానికి అతను రచయిత అయినందుకు గర్విస్తున్నాడు.

మళ్ళీ రాస్తున్నాడు కొత్తభావోద్రేకంలో, విలాస మధుర ధ్వనుల్లో, విషాద సంగీతాలాపనలలో.

తాత్కాలికంగా ఆవరించిన వైరాగ్యంలోంచి అతనిలోని నవలాకారుడు బయటకు వచ్చాడు. చుట్టూ సమస్యలు, జీవితంలోని ప్రతి అణువూ ఓ చిక్కు సమస్య. ఎవడి వ్యక్తిగతమైన బాధ వాడిది. అది పరిశీలించటంలో ఆసక్తి పెరిగింది. ప్రజల బాధల్ని తమ బాధగా చేసుకుని కొందరు కవులు ఆలాపిస్తే తమ బాధను ప్రజలముందు ఆలాపించారు మరికొందరు ఇందులో ఉత్తమ సాహిత్యముకానిదేమీ లేదు. స్వంత విషయాన్ని విశ్వ జనీనం చేసినవాడే నిజమైన కళాకారుడు. అప్పుడే అతడి తపస్సు ఫలించినట్లు. ఒక మనిషి కోసం తపించినప్పుడే మనుగడ సార్థకం అయినట్లు.

లోతుగా ఆలోచిస్తే మామూలు విషయంలో కూడా గొప్ప సత్యాన్ని గ్రహించగలడు మేధావి. స్నేహితుడి పెళ్ళికి పోవటంలో, ప్రేమ సాఫల్యంలో, ఐదు రూపాయలనోటు జేబులో వుండగా హఠాత్తుగా ఎవడో స్నేహితుడు ప్రక్కను చేరటంలో రిక్షావాడితో బేరం చెయ్యటంలో, తండ్రి మాట వినటంలో, డబ్బు విలువ గ్రహించలేకపోవటంలో, ఒకడిని ఒకడు సహాయం కోరటంలో, పేరు రావటంలో, పేరు పోవటంలో, భార్యతో కాపుర చెయ్యటంలో, తమ్ముడికి జబ్బు చేయటంలో, వదినగారు ముభావంగా వుండటంలో వ్యక్తిగత పరిస్థితుల్ని బట్టి తీసుకుంటే ఎంత పరిధి ఎన్ని విధాలు? ఎన్ని విపరీతాలు.

ఈ ఆసక్తిలో, ఆకర్షణలో మానసిక సంఘర్షణలో, మనశ్శాంతి లేని స్థితిలో అతని రచనలకు ఒక ప్రక్క ప్రజలు జోతలు అర్పిస్తోంటే "అనుభవం లేదు, ఒట్టి ఉత్సాహం" అని ఎక్కడో ఓ వెకిలి కంఠం అసహ్యంగా, కీచుగా వినిపిస్తోంది.

"అనుభవానికి నిర్వచనం ఏమిటి?"

తిండిలేక మాడటమే, ఉద్యోగాల కోసం వెదుక్కుంటూ కుళ్ళి కృశించటమే. ఆడవాళ్ళకు వలలు పన్నుతూ బ్రతకడమే. స్పర్ధలతో వైషమ్యాలతో జీవించడమే అనుభవమా?

ప్రతి అల్ప విషయానికి ప్రాముఖ్యము యిచ్చి సాహిత్య సృష్టి చేస్తున్న పాశ్చాత్య సాహిత్య వేత్తలని చూసి అభినందించే మానవుడు అదే పని తెలుగువాడు చేస్తే యెందుకు ఓర్చలేక పోతున్నాడు? "మన వాళ్ళలో కొత్తదనము లేదు, అభ్యుదయం లేదు" అని ఘోషలు పెట్టే ప్రాణి అది ఎవరన్నా తీసుకువస్తే ఎందుకు సహించలేకపోతున్నాడు?

ఎవరి జీవితం వారిది. పరిస్థితుల్ని బట్టి, వాతావరణాన్ని బట్టి యీ భూమ్మీద వందల వేల, లక్షల రకాల అనుభవాల సంపుటాలు.

తన స్వంత వృత్తితో అతడ్ని అతను స్వేచ్ఛగా పాలించుకుంటూ మలుచుకుంటున్న ఈ దశలో తనకు నచ్చిన కోణం నుంచి సాహిత్య సృష్టి చేస్తున్నాడు.

అందరూ ఒకేలా ఎందుకు రాయాలో అతని అర్థంకాదు. అతనికో దారివుంది. ఆ దారిన నడిచిపోతూ టెక్నిక్ కోసం, కొత్తవిధంగా చెప్పటం కోసం గిలగిల్లాడుతాడు. ఓ కొత్త ప్రయోగం చెయ్యాని రచనంటూ చెయ్యలేదు.

*ప్రపంచంలో ఒకటే గొప్ప సిద్ధాంతం. అది సిద్ధాంతం అంటూ ఏమీ లేకపోవటం. ఎవడూ మనిషిని శాసించలేడు. బుజ్జగించలేడు. అలా చేసినా అది క్షణికం. ప్రపంచాన్ని ఒక దారికి త్రిప్పటం ఎవరితరమూ కాదు సూచించు. నీ భావాలని. స్పష్టంగా జరుగుతూన్న దాన్ని నీ బాధలో పడు కాని ఎవర్నీ నీ దాసుల్ని చేసుకోవటానికి ప్రయత్నించకు. నిన్ను ప్రజలు ఆరాధించవచ్చు. ప్రాణం ఇవ్వవచ్చు. కాని వాళ్ళ వ్యక్తిత్వాల మీద అజమాయిషీ చెయ్యకు. నువ్వే తెలివైన వాడివనీ ప్రపంచం నిన్ను అర్థం చేసుకోవటల్లేదనీ కేకలు పెట్టకు. నీ చుట్టూ పరిధులు గీసుకోకు. ఒకే గిరితో ప్రదక్షిణాలు చెయ్యకు.*

తనకు తోచిన విషయాన్ని గురించీ, చూసిన విషయాన్ని గురించీ అనుభవించిన విషయాన్ని గురించీ స్వచ్ఛంగా విశృంఖలంగా రాస్తున్నాడు.

తను ఏదో సాధించాలి. ఉన్నత శిఖరాగ్రాలు చేసుకోవాలి. నిమిషాల విలువ తెలుసుకుంటున్నాడు. తను డాక్టరు కావాలి. రచయితగా నిలవాలి. రోగులకు, పాఠకులకు శక్తి ఉన్నన్నాళ్ళూ శారీరకంగా, మానసికంగా మంచి మందు ఇస్తూ అలాగే బ్రతకాలి.

సుఖం! సుఖం లేకపోతే పోనియ్యి అందుకే ఇదంతా, ఈ తపన. అన్వేషణ.

తన కథలు కొన్ని సినిమాలుగా వస్తున్నాయి. ప్రజలు చూస్తున్నారు. తను అందరకూ సన్నిహితుడు అవుతున్నాడు. రచయితగా ఇంత మధుర విషాదమైన జీవితం వుందని తెలుసుకుని, ఆశ్చర్యపడుతున్నాడు.

ఇది తన ఆవేదన, ప్రజలకు తన నివేదన.

32

ఓరోజు...

రాత్రి పదిగంటలయింది. శైలజ పడుకుని వున్న గదిలో బెడ్‌లైట్ సన్నగా వెలుగుతోంది. గది కిటికీలకు తెరలు కట్టేసి వుండటం వలన ఆమెకు ఆకాశం కనిపించదు.

"చినబాబూ" అని పిలిచింది ఆమె నీరస కంఠంతో.

"ఓయ్" అంటూ  మధుబాబు లోపలకు వచ్చాడు.

"ఇంతసేపు ఏం చేస్తున్నావు?"

"బయటి వసారలో నిలబడి వున్నాను."

"చాలా రాత్రవుతోంది ఇహ పడుకోకూడదూ"

అతనేం జవాబు చెప్పలేదు.

"నాకేంకాదు చినబాబు ఇంకా కొన్నాళ్ళపాటు బ్రతుకుతాను. నాకోసం శ్రమపడవద్దు."

అతనామె ముఖంలోకి చూస్తూ "మీరు పడుకుని నిద్రపొండి. అట్టే మాట్లాడటం ఆరోగ్యానికే హాని" అన్నాడు.

"చాలా అశాంతిగా ఉంది చినబాబూ"

అతను మెదలకుండా ఊరుకున్నాడు.

"నా జీవితం ఇలా అంతమౌతుందని తెలుసు. ఎన్నో చేశాను. ఎన్నో మలుపులు అనుభవాలు ఎంతో పైకి వచ్చాను. కాని నాకు కావలిసిందేమిటో కనుక్కోలేకపోయాను. ఎంత వెదికానని, అబ్బ! చివరకు అసంతృప్తితోనే వెళ్ళిపోవాల్సి వస్తోంది చినబాబూ. నాకు కావలిసిందేమిటో నువ్వయనా చెప్పవూ"

అతని గుండె కెలికినట్లయింది. ఈ శైలజ ఒకనాడు తన దగ్గరకు రోగిగా వస్తానని ముందుగానే అడిగింది. మనశ్శాంతి కోసం అన్వేషణలోని వక్రచేష్టితాలతో ఆమె ఆరోగ్యం దెబ్బతింది. మంచాన పడి తీసుకుంది. కొన్నాళ్ళు గడిచాక తనను వచ్చి తీసుకు వెళ్ళమని మధుబాబుకి వైర్ ఇచ్చింది. అతని కారులో వెళ్ళి తనతో తీసుకువచ్చాడు. ఆమె భర్త అప్పుడప్పుడూ వచ్చి చూసి పోతున్నాడు.

"ఆ కుర్చీ యిలా దగ్గరకు లాక్కుని కూర్చో చినబాబూ!"

అతనామె మంచానికి చేరువగా కుర్చీలో కూర్చున్నాడు మధుబాబు.

"జవాబు చెప్పవూ"

మధుబాబు ఓ నిట్టూర్పు విడిచాడు. "మనకు కావాలిసిందేమిటో తెలుసు కోవటమంటూ ఎప్పుడూ వుండదు శైలజాదేవీ, కాని ప్రపంచంలో తృప్తి అనేది ఒకటుంది. అంతకంటే పెద్ద ఆకర్షణ మరొకటి లేదు. మనుషులు ఎక్కడికక్కడ తమ శక్తి సామర్థ్యాలు కొలదీ ఏదో ఒకటి సాధించి అదే తమకు కావలిసిందన్న నిర్ణయానికి వచ్చేస్తారు. ఇంతేకాదేమోనన్న సంశయం అప్పుడప్పుడు వేధిస్తున్నా ఆ సంశయం నిజమైతే కలిగే ఉద్విగ్నత భరించలేమోనన్న భయంతో ఆ ఆలోచనను త్రోసి పుచ్చుతారు. ఓ డాక్టరు, ప్లీడరు, నటుడు ఇలా ఎవర్ని తీసుకున్నా వాళ్ళకు సాధించిందానికన్నా ఇంకా ఏదో కావాలి. దానికి రూపంలేదు. ఒక్కో వ్యక్తికి ఒక్కో ఆకృతిలో వుంటుంది. కొంతమంది మాత్రం ఆ రూపాన్ని తెలుసుకుందామన్న భ్రాంతిలో పడి. ఆ అన్వేషణలో మిగతా జీవిత సుఖాన్ని ధార పోస్తారు. చివరకు మిగిలేది కారణం వుండీలేని అశాంతే."

శైలజ అతని వంక విస్మయంగా చూసింది. "నీవు కూడా.."

"నేనూ మానవ మాత్రుడ్నేగా శైలజా దేవీ"

"అయితే మనకది లభించదంటావా?" అంది నిరాశగా ఆమె.

మళ్ళీ కొంచెం ఆగి ఆమె "నా జీవిత కథ వినవూ" అని అడిగింది జాలిగా.

"ఉహూఁ, వినను."

"పోనీ నీ కథ చెప్పు"

"చెప్పను."

"ఎందుకని?"

"కారణం ఓసారి చెప్పాడు. పాతదే అయినా యెప్పటికప్పుడు కొత్త అనిపించే విచిత్రం యీ రజిత హృదయుల జీవిత చరిత్ర. ఆ కొత్తకథ వినకుండా మనిషిని బట్టి గ్రహించినప్పుడే సానుభూతీ, విలువ పెరుగుతాయి."

"నీకు ఎంత ఆలోచన చినబాబూ?" అంటూ శైలజ నిట్టూర్పు విడిచి మౌనంగా పడుకుంది.

మధుబాబు రెండు నిమిషాలు అలానే మెదలకుండా కూర్చుని, మెల్లిగా లేచి కిటికీ దగ్గరకు వచ్చాడు. తెర ప్రక్కకు తొలగించి చూశాడు.

పౌర్ణమి

పండు వెన్నెల కాస్తోంది.

ఆకాశంలో చుక్కల నడుమ నిండు చంద్రుడు నిర్మలంగా ప్రకాశిస్తున్నాడు. ఈ దృశ్యాన్ని చూస్తూనే ఇందాక అతను వసారాలో నిలబడివున్నాడు. ఇంతలో శైలజ లోపలకి పిల్చింది.

ఈ వెన్నెల తన జీవితాన్ని స్పృశించలేదు.

కథకుడు కావాలని, గొప్ప రచయిత కావాలని ఒకనాడు కలలుకన్నాడు. చిన్న వయసులోనే ఎన్నో పుస్తకాలు రాశాడు. ఎంతో పేరు వచ్చింది. ఇప్పుడు కూడా రాస్తూనే వున్నాడు. ఎన్నో బహుమతులు వచ్చినై. అభినందనలు వచ్చినయి. అనుభవాలు! డాక్టరయాడు. అయినా వెలితి. పొందబోయే ముందు ఊహించిన ఉత్సాహం, పొందాక ఉండటం లేదు. ఈ వయసులోనే రచయితగా నిండు జీవితం అనుభవించాడు. తననెందరో ఆరాధించారు.

అయినా తనకు కావలసిన వ్యక్తి దొరకలేదు.

రాజ్యలక్ష్మి...ఇందిర...పద్మజ కళ్ళముందు మెదుల్తున్నారు.

శాశ్వతంగా విడిచిపెట్టి వెళ్ళిపోయింది రాజ్యలక్ష్మి. ప్రేమ అంటే అర్థంకాని దశలో తన జీవితంలో ప్రవేశించి, తనని కదిలించి, చివరకి అస్పష్టంగానే మిగిల్చి, తాను మాత్రం తప్పుకుంది రాజ్యలక్ష్మి.

ఇందిర ఎక్కడ వుందో ఇప్పుడు? పెళ్ళయాక మళ్ళీ కనబడలేదు. తనని మర్చిపోయిందో, జ్ఞాపకం వుంచుకుందో, ఎంతమంది పిల్లల్ని కన్నదో.

యెప్పటికి తనని విడిచిపోని పద్మజ. దగ్గరగా దూరంగా వుండే తియ్యని ఆశ. పరమేశ్వరుని అపూర్వ సృష్టి యెప్పటికప్పుడు నూతనానందం. తాను ఎదురుచూసే స్వేచ్ఛ ఆమెకిరాదు. అయినా ఆశతో ఎదురు చూస్తూవుంటుంది. ప్రస్తుతాన్ని ద్వేషించదు. రాజీ పడదు. కాని అసహ్యించుకోదు. తెగిన మనసుని అతుకు పెట్టుకోవటంతోనే మెల్లగా ఆమె జీవితం గడిచిపోతుంది.

అతను నిట్టూర్చాడు.

ఒక్క స్త్రీతో శాశ్వతంగా జీవించాలన్న తన ఆశ నిష్ఫలమైంది. తనని విడిచి పెట్టి ఒక్కొక్కరూ దూరంగా వెళ్ళిపోయారు. తను ఎప్పటికీ బాటసారే. ఎదురు దెబ్బలు తింటూ, దారి తెలియక తికమకపడే ప్రయాణికుడే.

"ఏమిటి చూస్తున్నావు?" శైలజ కంఠం వెనకనుంచి వినపడింది.

"ఓ జాలిలేని స్వరూపాన్ని."

"ఏమిటది?"

"చూడండి" అంటూ తాను అడ్డుతొలగి, తెర మరింత ప్రక్కకి లాగేశాడు.

శైలజ చూసింది. నీలాంబర సరసిలో నిండు జాబిల్లి.

(సమాప్తం)

Post your comments